

చుడా చైర్‌పర్సన్‌గా కటారి హేమలత ప్రమాణ స్వీకారం

డివైడర్‌ను ఢీకొని టెంపో బోల్తా

14మందికి గాయాలు

7లో





హిందూ జాగరణసమితి ఆధ్వర్యంలో చివరి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పుంగనూరు కోనేరులో దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోనేటి వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అఖండదీపాన్ని జనసేన నాయకుడు వేణుగోపాల రెడ్డి, టీడీపీ నాయకుడు దేశాధిప్రకాశ్ కోనేటిలోకి తీసుకువచ్చారు. హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తుల శివనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. భక్తులంతా కోనేటిలో వేలాది దీపాలను వెలిగించారు.

- పుంగనూరు, ఆంధ్రజ్యోతి

నేడు జాతీయ పాల దినోత్సవం

పాల వెల్లువ

చిత్తూరు సెంట్రల్ ఆంధ్రజ్యోతి

పాల ఉత్పత్తిలో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. ఉద్యాన పంటల తర్వాత ఎక్కువ మంది రైతులు పాడి పశువుల మీద ఆధారపడి జీవనం సాగిస్తారు.దాదాపు 1,11,168 కుటుంబాలు పాడిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.రోజుకు సుమారు 20 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శ్రీజ'కు చెందిన 36 బల్క్ మిల్క్ సెంటర్ల ద్వారా రోజుకు 1.62 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. వీటిలో అత్యధిక శాతం పాలు తిరుమలకు వెళతాయి.శాంతిపురం మండలం నుంచి అత్యధికంగా రోజుకు 1.20 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి కాగా, పాలసముద్రం మండలంలో అత్యల్పంగా రోజుకు 25వేల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది.



పుంగనూరు ప్రేమికుడు

బైరెడ్డిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశీయ ఆవులను పెంచిపోషించడంలో ఎంతో సంతృప్తి వుందంటున్నారు రైతు శివయ్యనాయుడు. బైరెడ్డిపల్లె మండలం కైగల్ వద్ద వ్యవసాయక్షేత్రంలో పదేళ్లుగా ఈయన పుంగనూరుజాతి ఆవులను పెంచుకుంటున్నారు. ఆయన వద్ద ప్రస్తుతం మూడు పుంగనూరు ఆవులున్నాయి. ఇవి ఒక్కొక్కటి రూ. లక్ష నుంచి రూ. 3లక్షల వరకు ధర పలుకుతాయని తెలిపారు.ఆవుల వద్ద పాలు కూడా పిండకుండా దూడలకే వదిలేస్తున్నట్లు చెప్పారు. తనవద్ద వున్న ఆవులను ఎవరికైనా అమ్మినా వాటిపైనవున్న ఇష్టంకొద్దీ మళ్లీ పుంగనూరుజాతి ఆవులనే కొని పెంచుతున్నట్లు తెలిపారు.దేశీయ ఆవుల సంతతి అంతరించిపోకుండా వుండేందుకు అందరూ కృషిచేయాలని శివయ్యనాయుడు కోరుతున్నారు.

మన స్పెషల్.. పుంగనూరు ఆవు

రెండు నుంచి మూడడుగుల ఎత్తు కలిగి, తోక నేలను తాకుతూ, పొడవు దేహం కలిగి ఆకర్షణీయమైన రంగు కలిగిన పుంగనూరు జాతి ఆవు అదృష్టానికి పేరు గాంచింది. దాదాపు రూ.2 లక్షల వరకూ పలికే ఈ ఆవును ధనవంతులు తమ గృహాల్లో పెంచుకోవడానికి మక్కువ చూపుతారు.పుంగనూరు, పలమనేరు, గంగవరం, తవణంపల్లె మండలాల్లో ఇవి అధికంగా ఉన్నాయి.

పుంగనూరు జాతి ఆవులపై పరిశోధనలు

పుంగనూరు జాతి ఆవులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పలమనేరు సమీపంలోని క్యాటిల్ ఫాంలో వంద పుంగనూరు జాతి ఆవులపై ప్రయోగాలు చేయడంతో పాటు వీటి సెమన్ ఆసక్తి కలిగిన రైతులకు అందజేస్తూ సంతానాన్ని పెంచుతున్నారు.పాలు తక్కువగా ఇచ్చినా వెన్నశాతం అధికంగా వుండడం వీటి ప్రత్యేకత. వీటి పోషణ ఖర్చు తక్కువగానే వుంటుంది.వీటికి వ్యాధి నిరోధకశక్తి కూడా ఎక్కువ.

జిల్లాలో 5.44 లక్షల ఆవులు, గేదెలు





హలికర్ ఎద్దు

హలికర్ జాతి రకం ఆవులు తక్కువగా ఉన్నా, ఎద్దులు మాత్రం అధికంగా ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు గ్రామాల రైతులు ఈ ఎద్దులకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. సాగుకు ప్రయోజనకరంగా ఉండే ఈ జాతి ఎద్దులు కనీస ధర రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వుంటుంది.

రోజుకు 20 లక్షల లీటర్ల పాల ఉత్పత్తితో రాష్ట్రంలోనే మొదటిస్థానం

గిర్ ఆవులతో ప్రకృతి సేద్యం



పాలసముద్రం మండలం వెంగళరాజుకుప్పానికి చెందిన రామచంద్రరాజు 73ఎకరాల్లో కొబ్బరి, మామిడి, ఉసిరి, జామ, అరటి, పసుపు, బొప్పాయి పంటలు సాగు చేస్తున్నాడు. ప్రకృతి సేద్యంపై మక్కువతో మూడేళ్లుగా 28 గిర్ జాతి ఆవులను పెంచుతున్నాడు.వీటిద్వారా వచ్చే పేడ, గంజరంలతో ఘన జీవామృతం,ద్రవ జీవామృతం తయారు చేసి,సాగుకు ఉపయోగిస్తున్నాడు.బెంగళూరులో గిర్ జాతి ఆవు పాలు లీటరు ధర రూ.150, నెయ్యి కిలో రూ.2వేలు పలుకుతోంది. సేంద్రియ సాగుతో పెంచిన కొబ్బరి నుంచి తీసిన నూనెను లీటరు రూ.400కు విక్రయిస్తున్నాడు.

● పాడి సంపద

జిల్లావ్యాప్తంగా 5,44,587 పశువులున్నాయి. వీటిలో 5,40,397ఆవులుండగా 4,190 గేదెలున్నాయి.వీటిలో ప్రసిద్ధి గాంచిన పుంగనూరు జాతి ఆవులతో పాటు, దేశవాళీ, హలికర్ , హెచ్ఎఫ్ సంకర జాతి , జెర్సీ సంకర జాతి , గిర్ జాతి ఆవులున్నాయి.అలాగే దేశవాళీ గేదెలతో పాటు, గ్రేడెడ్ ముర్రా, ముర్రా జాతి గేదెలున్నాయి.

● ప్రథమ స్థానం

జిల్లాలో 70శాతం హెచ్ఎఫ్ జెర్సీ జాతి ఆవులే ఉన్నాయి. వీటి ద్వారానే పాల ఉత్పత్తి జిల్లాలో అధికంగా ఉంటుంది. ఒక్క ఆవు రోజుకు 15 నుంచి 20 లీటర్ల పాలు ఇస్తుంది. జెర్సీ జాతి ఆవులు 10 శాతం ఉన్నాయి.రోజుకు 8 నుంచి 12 లీటర్ల పాలు ఇస్తాయి.

● పైలట్ ప్రాజెక్టు

పాల ఉత్పత్తిని పెంచేందుకు కుప్పం నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.ఈ ప్రాంతంలో పాల ఉత్పత్తి రోజుకు 4 లక్షల లీటర్లుండగా 10 లక్షలకు పెంచడంపై పశుసంవర్థక శాఖ అధికారులు దృష్టి సారించారు. తరచూ యానిమల్ మెడికల్ క్యాంపులు పెట్టడంతో పాటు పశుపోషణకు అవసరమైన ఫీడ్‌ను సబ్సిడీపై పాడి రైతులకు ఇచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఎ కౌ.. ఎ ఇయర్



పాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం. ఎ కౌ.. ఎ ఇయర్ అనే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేపడుతున్నాం. ప్రస్తుతం ఆవు ఒక దూడను ఈనేందుకు ఏడాదిన్నర పడుతుంది. ఈ సమయాన్ని తగ్గించి ఏడాదికి ఒక దూడను ఈనే విధంగా చర్యలు చేపట్టాం. పాడి ఆవులకు నిత్యం ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు ఉత్పత్తి కారకాలు పెంచేందుకు అవసరమైన పోషకాలు అందిస్తున్నాం.

- ప్రభాకర్, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్థక శాఖ

● వెనకబడ్డ పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి

● ఇప్పటివరకు 2.56 లక్షల సభ్యత్వాల నమోదు

సభ్యత్వ నమోదులో
కుప్పం దూకుడు

చిత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం ముందుకు దూసుకుపోతోంది.కుప్పం చిత్తూరు, పుంగనూరు తొలి మూడు స్థానాల్లో ఉండగా.. పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి చివరి నుంచి మూడు స్థానాల్లో ఉన్నాయి.కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని టీడీపీ అధిష్ఠానం ఈసారి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించింది. గతంలో ఉన్న రూ.2 లక్షల ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచింది. చనిపోతే మట్టి ఖర్చులకు సాయం, పిల్లలకు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉచిత విద్య.. వంటి అనేక సంక్షేమాల్ని ప్రకటించింది. జిల్లాలో ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు కూడా అదే ఉత్సాహంతో భారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసారి లబ్ధి పెంచడంతో ఓటర్లు తక్కువున్న నియోజకవర్గాల్లో 60 వేలు, ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో 80 వేల వరకు సభ్యత్వాలను నమోదు చేసేలా ప్లాన్ చేసుకున్నారు.గత నెల 26వ తేది ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సోమవారం నాటికి జిల్లాలో 2.56 లక్షల సభ్యత్వాల నమోదు పూర్తయింది.

కుప్పం నియోజకవర్గం 81,527 సభ్యత్వాలతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. 2014లో 65 వేలు, 2019లో 70 వేల సభ్యత్వాలు చేయగా.. ఈసారి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో లక్ష సభ్యత్వాలను నమోదు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. పరిస్థితి చూస్తుంటే లక్ష సభ్యత్వాలను దాటేలా ఉంది.

● జిల్లా కేంద్రమైన చిత్తూరు నియోజకవర్గం 40,543 సభ్యత్వాలతో జిల్లాలో రెండో స్థానంలో ఉంది.అత్యధిక సభ్యత్వాలు చేసినవారికి ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బృందం స్థానిక నాయకుల సహకారంతో సభ్యత్వాల నమోదులో కృషి చేస్తోంది. మరో 20 వేల సభ్యత్వాలు చేసే అవకాశముంది. ● పుంగనూరు నియోజకవర్గం 34,473 సభ్యత్వాలతో మూడో స్థానంలో ఉంది. చౌడేపల్లె, పులిచెర్ల, రొంపిచెర్లలో అధికంగా సభ్యత్వాలు నమోదయ్యాయి. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి 60 వేల దాకా చేయాలని లక్ష్యం పెట్టుకుని మండలానికి ఐదుగురు కోఆర్డినేటర్లను నియమించి సభ్యత్వాలు చేయిస్తున్నారు. ● పలమనేరు నియోజకవర్గంలో 33,862మంది సభ్యత్వాలను నమోదు చేయించారు.ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఈ విషయమై పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ముందుకు తీసుకువెళుతున్నారు. ●నగరి నియోజకవర్గంలో సభ్యత్వాలు పాతికవేలను సమీపిస్తుండగా పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో 20వేలు దాటాయి. ●తిరుపతి జిల్లాలో ఉన్నా.. చంద్రగిరి నియోజకవర్గం చిత్తూరు పార్లమెంటు పరిధిలోకి వస్తుంది. పార్లమెంటు వారీగా చూసుకుంటే జిల్లాలో కుప్పం తర్వాత చంద్రగిరి నియోజకవర్గం 42017 సభ్యత్వాలతో రెండో స్థానంలో ఉంది. ఇక్కడ ఎమ్మెల్యే పులివర్తి నాని తన బలాన్ని చాటేందుకు కృషి చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా సభ్యత్వాల నమోదు వివరాలు

కుప్పం	81527	నగరి	24472
చిత్తూరు	40543	జీడీనెల్లూరు	21438
పుంగనూరు	34473	పూతలపట్టు	20073
పలమనేరు	33862	చంద్రగిరి	42017



చిత్తూరులో రాత్రిపూట జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు

వీఆర్‌కు గంగాధరనెల్లూరు ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్

గంగాధరనెల్లూరు,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులో పని చేస్తున్న ఏఎస్ఐ అంజనేయులురెడ్డిని,హెడ్‌కానిస్టేబుల్ గురుస్వామిరెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి.గంగాధరనెల్లూరు పోలీసు స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడంపై ఎస్పీ మణికంఠకు ఇటీవల ఫిర్యాదులందిన నేపథ్యంలో ఈనెల 21వతేదిన ఆయన స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆయన పరిశీలించిన ఐదు రోజుల్లోపే ఇద్దరిని వీఆర్‌కు పంపడం సంచలనంగా మారింది.పాలసముద్రంలో పని చేస్తున్న ఏఎస్ఐ లక్ష్మిని, పలమనేరులో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ గోపీని, గుడిపాలలో పనిచేస్తున్న కానిస్టేబుల్ నవీన్‌ను గంగాధరనెల్లూరుకు బదిలీ చేశారు.

ప్రాణాలు తీసిన అనారోగ్యం

● భార్యాభర్తల బలవన్మరణం

పుంగనూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):కిడ్నీలు పాడైన భర్తకు క్యాన్సర్ కూడా వచ్చిందని తెలిసి తీవ్ర ఆందోళనకు లోనైన ఓ మహిళ భర్తతో కలిసి బలవన్మరణానికి పాల్పడింది.పుంగనూరు మండలం మేలుందొడ్డికి చెందిన శ్రీనివాసులు(50), ఆయన భార్య నీలమ్మ కూలి పనులతో జీవనం సాగిస్తుండేవారు. రెండేళ్ల క్రితం శ్రీనివాసులు అక్క లక్ష్మీదేవి క్యాన్సర్‌వ్యాధితో మృతి చెందింది. అప్పటిదాకా ఆమె ఆలనాపాలన చూసిన శ్రీనివాసులు దంపతులు ఆమె అంత్యక్రియలు పూర్తి కాగానే బెంగళూరుకు కాపురం మార్చారు.కిడ్నీలు ఫెయిల్ కావడంతో శ్రీనివాసులు ఆస్పత్రి పాలవగా నీలమ్మ కూలి పనులకు వెళ్లేది.కుమారుడు భానుప్రకాశ్ ప్రైవేటు కంపెనీలో పని చేసేవాడు.మూడు నెలల క్రితం శ్రీనివాసులుకు క్యాన్సర్ సోకినట్లు నిర్ధారణ కావడం నీలమ్మను కుంగదీసింది. తనకు కూడా క్యాన్సర్ వచ్చి వుంటుందని అనుమానపడి తీవ్రఆందోళనకు గురయ్యేది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్వగ్రామమైన మేలుందొడ్డికి శ్రీనివాసులు,నీలమ్మ వచ్చారు. సాయంత్రం వరకు పొలాల్లో కలసి తిరిగారు. 4గంటల ప్రాంతంలో శ్రీనివాసులు తన మేనల్లుడు పవన్ కళ్యాణ్‌కు ఫోన్ చేశాడు. తామిద్దరం గ్రామ సమీపంలోని గట్టు ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుంటున్నట్లు చెప్పాడు.అలాంటి పని చేసుకోవద్దని ధైర్యం చెప్పిన పవన్ కళ్యాణ్ బంధువులకు,స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే పొలం వద్దకు చేరుకున్నారు.అప్పటికే ఇద్దరూ చెట్టుకు ఉరి వేసుకుని వుండడంతో వెంటనే ఉరి తొలగించి ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించారు.అయితే ఆ లోపే మృతి చెందినట్లు గుర్తించిన గ్రామస్థులు ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. సీఐ శ్రీనివాసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు పవన్‌కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



శ్రీనివాసులు, నీలమ్మ(ఫైల్ ఫొటో)

నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లబోతున్నా

ఇండియన్ షూటర్ ఎలవెనిల్ వలరివన్



తిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 2018 జూనియర్ ప్రపంచకప్‌లో భారత్‌కు బంగారు పతకాన్ని సాధించిన ఇండియన్ క్రీడా షూటర్ ఎలవెనిల్ వలరివన్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎలవెనిల్ వలరివన్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. చాలా రోజుల తర్వాత స్వామి దర్శనం లభించిందని, మంచి అనుభూతి కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో భోపాల్‌లో జరిగే నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లబోయే ముందు స్వామి ఆశీస్సుల కోసం తిరుమల వచ్చినట్లు తెలిపారు.



నేత్రపర్వం.. కోటి దీపోత్సవం

తిరుపతి ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రామచంద్ర పుష్కరిణి ప్రాంగణంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. కార్తీక మాసంలో 365 వత్తులతో దీపం వెలిగించడం ద్వారా ఏడాది పొడవునా దీపం వెలిగించకపోయినా ఆ అపరాధ భావన పోతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఫిల్మ్ సొసైటీ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు, కార్యదర్శి శేషగిరిరావు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్, పారిశ్రామికవేత్త పీసీ రాయల్, ఫిల్మ్ సొసైటీకి చెందిన ప్రసాదరావు, బుజ్జిబాబునాయుడు, బండి మధుసూదనరెడ్డి, గుల్జార్, అనసూయ, మేరీజాయ్, శాంతావాణి, భాస్కర్, శమంతకమణి, భక్తులు పాల్గొన్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

కార్తీక వెలుగుల్లో కపిలతీర్థం

కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా తిరుపతిలోని కపిలతీర్థంలో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ మహిళలు పిండి తలిగ వేసి నేతి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పుష్కరిణికి నాలుగు వైపులా ఉన్న మండపాలలో దీపాలను వెలిగించారు. జలపాతం కింద భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం కామాక్షి కపిలేశ్వరులను, పరివేవతలైన వల్లీయమ్మ, సుబ్రమణ్యస్వామి, గురుదక్షిణామూర్తి, నాగలింగ కూటమిని దర్శించుకున్నారు.

శ్రీకాళహస్తిలో కార్తీకం రద్దీ



నాలుగో కార్తీక సోమవారం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. స్వర్ణముఖి నదిలో స్నానాలు ఆచరించి రెండోగేటు సమీపంలో భక్తులు దీపారాధన సమర్పించారు. సుమారు 37వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.50శీఘ్ర దర్శనం టిక్కెట్లు గరిష్ఠ స్థాయిలో 5,725, రూ.200 ప్రత్యేక ప్రవేశదర్శనం 3,822 కలిపి మొత్తం 9,547 టిక్కెట్లు అమ్ముడైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక ఐదు రకాల రాహుకేతుపూజలు కలిపి 4,169 జరిగాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



కాలుష్యం కోరల్లో విలవిల



'నిబంధనలు పాటించని పరిశ్రమల నుంచి నిరంతరం వెదజల్లుతున్న రసాయనాల వల్ల ఊపిరి తీసుకోలేకపోతున్నాం. గుండెజబ్బుల బారినపడుతున్నాం.. కళ్లు మంటలతో అల్లాడుతున్నాం. కాపాడండి సారు' అంటూ రేణిగుంట మండల పరిధిలోని పారిశ్రామికవాడ పల్లెల ప్రజలు వేడుకుంటున్నారు. పీల్చే గాలి, తాగేనీరు కలుషితం కావడంతో ఎప్పుడు ఏ రోగం వస్తుందో తెలియక బతుకు జీవనం సాగిస్తున్నారు.

- పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న రసాయనాలు
- రోగాల బారిన పరీవాహక గ్రామాల ప్రజలు
- ఊపిరి తీసుకోలేక పోతున్నాం..కాపాడండి అంటూ వేడుకోలు



రసాయనాలు వెదజల్లుతున్న మైథిలి కర్మాగారం

కథనం రేణిగుంట,ఆంధ్రజ్యోతి

రేణిగుంట మండలంలోని గాజులమండ్యం, ఎర్రంరెడ్డిపాళెం, రేణిగుంటలో మూడు పారిశ్రామిక వాడలున్నాయి. అప్పటి జనసంఖ్య ఆధారంగా ఈ ప్రాంతాలను పారిశ్రామికవాడలుగా గుర్తించి ప్రభుత్వం కేటాయించింది. నేడు వాటికి చుట్టుపక్కల జనాభా పెరగడంతో ఊర్లు, గ్రామాలు విస్తరించాయి. అదే తరుణంలో పారిశ్రామికవాడల్లో కాలుష్యం పెరిగింది. పరి శ్రమల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను యథేచ్ఛగా బయటకు వదిలేస్తున్నారు. ఈ విషయమై నల్లపాళెం, నీలసానిపేట, అత్తూరు, దేశమ్మనగర్, గాజులమండ్యం, ఎర్రంరెడ్డిపాళెం, వినాయకపురం గ్రామాల ప్రజలు అనేక పర్యాయాలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదులు చేశారు. చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించి తర్వాత గాలికొదిలేస్తున్నట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పారిశ్రామికవాడల్లో ప్రమాదాలు నెలకొన్న సమయాల్లో మాత్రం హడావుడి చేసి, నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపేదిశగా చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

మురుగు కాలువలు లేక..

తిరుపతి-రేణిగుంట మార్గంలోని పారిశ్రామికవాడలో రోడ్లు, మురుగు కాలువలు లేవు. కర్మాగారాల్లో ఉపయోగించే నీటిని బయటకు వదిలేస్తున్నారు. దీంతో కింద ఉన్న ఎర్రంరెడ్డిపాలెం, వినాయకపురం గ్రామాల్లో నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ చూసినా ప్లాస్టిక్, చెత్తా చెదారాలు దర్శనమిస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్‌ను వివరణ కోరగా తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని, ఈ ప్రాంతాల్లో పర్యటించి నోటీసులు జారీ చేస్తామని అన్నారు. అదేవిధంగా ఇండస్ట్రియల్ కారిడార్ జోనల్ మేనేజరు చంద్రశేఖర్‌ను వివరణ కోరగా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి స్థానిక పరిశ్రమల నుంచి సగం వాటా పెట్టుకుంటే పై అధికారుల దృష్టికి తీసుకుపోయి స్థానిక సమస్యలను అధిగమించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తమకు వచ్చే పన్నులకు కేవలం పారిశ్రామికవాడలో లైట్లు, ఇతర చిన్న సమస్యలను పరిష్కరించగలమని స్పష్టం చేశారు.



రోడ్డు పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



ఎర్రంరెడ్డిపాళెం పారిశ్రామికవాడలో రోడ్ల దుస్థితి

ఊపిరి తీసుకోలేకపోతున్నాం



మా గ్రామంలో 550 మంది నివసిస్తున్నారు. కర్మాగారాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అందుకే 2019లో ఎన్నికలను కూడా బహిష్కరించాం. దీంతో అప్పటి ఎన్నికల అధికారి, తహసీల్దారు ప్రాధేయపడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. నేటికీ సమస్య అలాగే ఉంది. గ్రామంలో అత్యధికంగా గుండెపోటుకు గురవుతున్నారు. ఆగస్టు, సెప్టెంబరులో ఇద్దరు మృతి చెందారు. గ్రామానికి ఆనుకుని ఉన్న పరిశ్రమ నుంచి వెదజల్లే రసాయన వాయువు వల్ల రాత్రి ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉంది.

- మోహన్‌రెడ్డి, నల్లపాళెం గ్రామస్తుడు

నోటీసులిచ్చినా పట్టించుకోవడం లేదు



గాజులమండ్యం పారిశ్రామికవాడలోని పలు ఫార్మా కర్మాగారాల నుంచి వచ్చే వాయువుల వల్ల పరిసర గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, కళ్లమంటలకు గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పలుసార్లు నోటీసులు ఇచ్చినా కర్మాగారాల యాజమాన్యాలు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మా గ్రామాల్లో సమస్యలను గుర్తించి, పరిష్కరించాలి.

- కరుణాకరరెడ్డి, అత్తూరు గ్రామస్తుడు

ప్రతి పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

- **అధికారులకు కలెక్టర్ ఆదేశం**



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'బడివైపు ఒక అడుగు- తల్లిదండ్రులతో ముచ్చట్లు' కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలోనూ మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి జేసీ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనరు మౌర్య, డీఈవో కేవీఎన్ కుమార్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి వారి పిల్లల అసెస్మెంట్ కార్డులను అందించాలన్నారు. పేరెంట్ మీటింగ్ రోజున డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందించే మెనూ ప్రకారం ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ కలిసి భోజనం చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యా విధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, తాగునీరు, పారిశుధ్యం, పిల్లల రక్తహీనత, వారి ఆరోగ్య సమస్యలు తదితరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలపై సమీక్షించి పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' పై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు ఎంఈవో, తహసీల్దార్, ఎంపీడీవోలు కూడా ఈ మీటింగులో పాల్గొనాలని, సచివాలయ సిబ్బందినీ భాగస్వామ్యం చేయాలన్నారు. పూర్వ విద్యార్థులనూ ఆహ్వానించాలన్నారు.

సమీక్షలు .. సమావేశాలు

ఉచిత ఇసుక విధానంలో అక్రమాలకు తావివ్వొద్దు

అక్రమాలకు తావు లేకుండా నూతన ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్లో పలు అంశాలపై సోమవారం ఆయన అధికారులతో సమీక్షించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ జియో ట్యాగింగ్ చేయడంపై సమీక్షిస్తూ ఏర్పేడు, వెంకటగిరి, కేవీబీపురం మండలాల్లో తక్కువ పురోగతి ఉందని, పుత్తూరు మునిసిపాలిటీ పనితీరు బాగుందన్నారు. ఈ నెల 30 నాటికి ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. పాట్‌హోల్స్ ఫ్రీ రహదారుల కాన్సెప్ట్ కింద ఆర్‌అండ్‌బీ కింద 66 పనులు మొదటి విడతగా చేపట్టినవి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ట్యూషన్ ఫీజు కోసం ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

వీఏకే రంగారావును సన్మానిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు



వెండి తెరపై రాముడు, కృష్ణుడు.. ఎన్టీఆరే

సినీ గేయ వజ్రోత్సవ సభలో వీఏకే రంగారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెండి తెరపై కృష్ణుడు, శివుడు, రాముడిగా ఎన్టీఆర్ తన నటనా ప్రావీణ్యంతో దర్శనమిచ్చారని ప్రముఖ సినీ, సంగీత, నాట్య, కళా విమర్శకుడు వీఏకే రంగారావు పేర్కొన్నారు. అనంతపురానికి చెందిన మహాబోధి సాహిత్య వేదిక ఆధ్వర్యాన ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాలులో సోమవారం జరిగిన ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినిమాల్లో ఎన్టీఆర్ పోషించిన వివిధ పాత్రల గురించి ఆయన ప్రస్తావించారు. సినీ కళారంగం పట్ల అంకిత భావం ఉండటం వల్ల ఒక పాత్రను పరిపూర్ణంగా పోషించగలిగారన్నారు. పౌరాణిక పాత్రల్లో ఆయన ఎంత సజీవంగా నటించారంటే.. వెండి తెరపై సాక్షాత్తు ఆ దేవతామూర్తులను చూసినంత అనుభూతిని ప్రేక్షకులు పొందారని చెప్పారు. తనకు తెలియని విషయాలను తెలుసుకోవడానికి ఎలాంటి సంశయం చూపేవారు కాదన్నారు. సినిమా రంగానికి సంబంధించి తన అభిప్రాయాన్ని ఎన్టీఆర్ ఎదుటే చెప్పినా, సహృదయంతో విమర్శను స్వీకరించారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ సినిమా పాటలను గుర్తు చేసుకోవడమంటే, తెలుగు జాతి తన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రనూ జ్ఞాపకం చేసుకున్నట్టు అవుతుందన్నారు. ప్రజలను చైతన్యం చేసే అంశాలు ఎన్టీఆర్ సినిమాల్లో అధికంగా ఉన్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు కొనియాడారు. నేటికీ ఎందరో కళాకారులు, రాజకీయ నాయకులకు ఎన్టీఆర్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు చెప్పారు. భాష, భావం, అభినయంలో ఎన్టీఆర్‌ను మరో పాత్రతో పోల్చలేమని రిటైర్డు ప్రొఫెసర్ జేవీ సత్యవాణి అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ సినీ రంగ ఔన్నత్యాన్ని ఈ తరానికి తెలియ చేయడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని మహాబోధి సాహిత్య వేదిక ప్రతినిధి ఆచార్య జి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, రిటైర్డు ప్రొఫెసర్లు కోసూరి దామోదర నాయుడు, కె.మునిరత్నం, ఎన్.మునిరత్నమ్మ, కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఇసుక డంప్‌ల సీజ్



రిలయన్స్ పెట్రోల్‌బంకు వెనుక ఇసుక డంప్

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. శ్రీకాళహస్తి శివార్లలోని చెన్నై రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక వైపు, తంగేళ్లపాళెం వద్ద మూతపడిన ఓ స్టోన్ క్రషర్ ప్రాంగణంలో ఇసుక డంప్‌లున్నట్లు అధికారులు సమాచారం అందుకున్నారు. ఆదివారం రాత్రి తహసీల్దారు మధుసూదన రావు ఆదేశాలతో సీనియర్ అసిస్టెంట్ నారాయణ, వీఆర్వో దినేష్ రెండు డంప్‌లను సీజ్ చేశారు. అలాగే తొట్టంబేడు మండలం నెల్లిమానుకండ్రిగ వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ప్రాంతంలో ఇసుకను నిల్వ చేసి అక్కడి నుంచి తరలించినట్లుగా ఆనవాళ్లను గుర్తించారు. అయితే రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేసి దీని వెనుక మూలసూత్రధారులను బహిర్గతం చేయకపోవడంపై రెవెన్యూ అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఘాట్‌లో ఎలుగుబంట్ల కలకలం

తిరుమల, నవంబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో సోమవారం ఎలుగుబంట్ల సంచారం కలకలం రేగింది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డులో ఏనుగుల ఆర్చ్ దాటాక రెండు ఎలుగుబంట్లు రోడ్డు దాటి కాలినడకమార్గం వైపు వెళ్లడాన్ని కొందరు వాహనదారులు గుర్తించారు. వెంటనే సమాచారాన్ని టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులకు అందజేశారు. ఈక్రమంలో అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అప్పటికే ఎలుగుబంట్లు వెళ్లిపోయినట్టు నిర్ధారించుకున్నారు. అయినప్పటికీ వాహనదారులను, నడకమార్గంలో వచ్చే భక్తులను అప్రమత్తం చేసి పంపుతున్నారు.

టెంపో ట్రావెలర్ బోల్తా

14 మంది భక్తులకు గాయాలు



బోల్తాపడి దెబ్బతిన్న టెంపో

పలమనేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టెంపో ట్రావెలర్ వాహనం బోల్తా పడి 14 మంది భక్తులు గాయపడ్డారు. ఈ సంఘటన బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలోని జగమర్ల క్రాస్ వద్ద జరిగింది. కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని నాయుడుపేటకు చెందిన భక్తులు టెంపోట్రావెల్ వాహనంలో ఆదివారం రాత్రి కర్ణాటక రాష్ట్రంలోని కోటిలింగాల పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున జగమర్లక్రాస్ వద్ద టెంపో అదుపు తప్పి నడిరోడ్డుపై ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న వనిత(40), మానసి(6), విజయకుమార్(35), సరిత(40), రేణుకమ్మ(50), మమత(28), కవిత(25), శ్రావణి(25), రేఖ(23), భాగ్యమ్మ(54), శ్రీనివాసులు(54), వంశీ క్రిష్ణ(33), చెంగమ్మ(42), కార్తీక్(30) గాయపడ్డారు. గాయపడిన వారిని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అందరికీ స్వల్ప గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్సలు చేసుకొని వెళ్లిపోయారు.

గొలుసు చోరీకి యత్నం

పోలీసులకు అప్పగించిన స్థానికులు



చోరీకి యత్నించిన మహిళను కట్టేసిన దృశ్యం

పుంగనూరు రూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళ మెడలోని గొలుసు చోరీకి యత్నించిన ఓ మహిళను స్థానికులు పట్టుకుని చితకబాదారు. తర్వాత పోలీసులకు అప్పగించారు. స్థానిక కొత్తపేటకు చెందిన రాజారెడ్డి భార్య భారతి(55). ఈమె పక్షవాతంతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం ఓ మహిళ కూర ఆకు విక్రయించడానికి వచ్చింది. కూర ఆకు కావాలా అని భారతిని అడిగింది. తర్వాత ఆమె పరిస్థితి అంచనా వేసి మెడలోని బంగారు చైన్‌ను లాక్కోవడానికి యత్నించింది. భారతి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆమెను పట్టుకుని చితకబాదారు. తర్వాత కట్టేసి పోలీసులకు అప్పగించారు. నిందితురాలు మదనపల్లె రోడ్డులోని అమరనాథరెడ్డి పెట్రోల్ బంక్ వద్ద కాపురం ఉన్న ప్రసాద రెడ్డి భార్య జయలక్ష్మిగా గుర్తించారు. ఈమె గత నెల 14న సింగిరిగుంట సమీపంలో పార్వతమ్మ కంట్లో కారంపొడి చల్లి బంగారు నగలు చోరీ చేసినట్లు అంగీకరించింది.

రీసర్వేపై అర్జీలను

10రోజుల్లోగా పరిష్కరించండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రీసర్వేకు సంబంధించి గ్రామసభల్లో అందిన అర్జీలను 10రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ సంబంధిత అంశాలపై జేసీ విద్యాధరితో కలసి చిత్తూరు, కుప్పం, నగరి, పలమనేరు ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షించారు. ఎక్కువగా విస్తీర్ణ వ్యత్యాసం, సరిహద్దుల వివాదాలు, జాయింట్ ఎల్‌పీఎంల సమస్యలపై కరెక్షన్లు చేయాలంటూ ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. వీటిని సర్వేశాఖ అధికారులతో కలసి సమన్వయం చేసుకుని పరిష్కరించాలన్నారు. వీటితోపాటు సీఎం, డిప్యూటీ సీఎం, రెవెన్యూ శాఖ మంత్రి, సీసీఎల్‌ఏ కార్యాలయాల నుంచి అందే అర్జీలను కూడా గడువు లోగా నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. విద్యార్థులకు సంబంధించి అపార్ కార్డు, ఆధార్ సవరణల అర్జీలను త్వరగా డిస్పోజ్ చేయాలన్నారు. డీఆర్వో మోహన్ కుమార్, సర్వేశాఖ ఏడీ జయరాజ్, డీఎల్డీవో రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుప్పంలో వందశాతం సౌరవిద్యుత్ లక్ష్యం

- సీఎంకు వివరించిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని 50,314 గృహాల్లో సౌరవిద్యుత్ అమర్చేందుకు అనుకూలంగా ఉండగా ఇద్దరు మినహా మిగిలిన ఇండ్ల యజమానులందరూ అంగీకారం తెలిపారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు సౌరవిద్యుత్‌పై సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో చిత్తూరు నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ పరిధిలో 2.66కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో సోలార్ రూఫ్‌టాప్ విద్యుదుత్పత్తికి అవకాశం లభిస్తుందని చెప్పారు. దీనికి గాను పీఎం సూర్యఘర్ కుసుం (పీఎంఎస్జీఎంబీవై) కింద చేపట్టిన కుప్పం రెస్కో ప్రాజెక్టుకు రూ.286 కోట్లు వ్యయం అవుతుందని చెప్పారు. ఇందుకు కేంద్రం నుంచి రూ.172 కోట్లు సబ్సిడీ రూపంలో అందే అవకాశం ఉందన్నారు. మిగిలిన రూ.114 కోట్లను లబ్ధిదారులు బ్యాంకుల ద్వారా రుణం పొంది సౌరవిద్యుత్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం వుందని తెలిపారు. సీఎం మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌తో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి సోలరైజేషన్ కార్యక్రమంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు.

సమగ్ర కులగణన చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి
- కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 175 అర్జీలు

చిత్తూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించ తలపెట్టిన జనగణనతోపాటు సమగ్ర కులగణన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్ఞాన జగదీశ్ కోరారు. ఈ మేరకు సంఘ నేతలతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అర్జీ అందజేశారు. భవిష్యత్తులో రిజర్వేషన్లపై ఆచరణాత్మకమైన విధానాలను రూపొందించాలంటే సమగ్ర కులగణన చేయాలని డిమాండ్ చేశారు. కాగా, జేసీ విద్యాధరి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ బాధితుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. మొత్తం 175 అర్జీలు అందాయి. వీటిల్లో రెవెన్యూ శాఖకే అత్యధికంగా 151 ఉండగా, మిగిలినవి 24 ఇతర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి.

ప్రధానంగా వచ్చిన అర్జీలిలా..

- బండిబాటను ఆక్రమించుకుని పొలంలో కలుపుకున్న గన్నా రామ చంద్రపై చర్యలు తీసుకోవాలని సోమల గ్రామానికి చెందిన రైతులు కోరారు.



కలెక్టరేట్ వద్ద బీసీ సంక్షేమ సంఘం నేతలు

- సర్వే నెంబరు 151-11లో 2.75 ఎకరాలకు పట్టా, పాసు పుస్తకం తనపేరుపై ఉన్నా.. ఆ భూమిని ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పులిచెర్ల మండలం రాయవారి పల్లెకు చెందిన సుబ్బయ్య నాయుడు కోరారు.
- శ్మశానానికి స్థలాన్ని కేటాయించాలని జీడీ నెల్లూరు మండలం వరత్తూరుకు చెందిన నాగరాజనాయుడు, గ్రామస్తులు కోరారు.
- భర్త చనిపోయాడని, ప్రస్తుతం చూపు సరిగ్గా కనపడక పోవడంతో పనులకు వెళ్లలేకపోతున్నానని, పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని పెద్దపంజాణి మండలం పెద్దారకుంటకు చెందిన పద్మావతి కోరారు.
- సర్వే నెంబరు 368-1లో 2.28ఎకరాలు, 348-1లో 1.82, 369-1లో 1.61, 349-1లో 1.02, 356-1లో 1.54 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని యాదమరి మండలం ఆరిమాకుల పల్లెకు చెందిన గీత తెలిపారు. విచారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.
- మెసానికల్ మైదానం రోడ్డులో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తన బిడ్డ అక్కడికక్కడే చనిపోయాడని కిరణ్‌తెలిపారు. ఇటువంటి జరగకుండా ఉండాలంటే ట్రాక్టర్, ఇతర భారీ వాహనాలను ఈ రోడ్డులో అనుమతించవద్దని కోరారు.



అర్జీదారురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పోలీసుశాఖకు 31 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 31 అర్జీలు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్‌తో కలిసి బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలపై త్వరగా విచారించి, బాధితులకు న్యాయం చేయాలని డివిజనల్ స్థాయి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. 31 అర్జీల్లో.. భూ తగాదాలపై 14, డబ్బు తగాదాలపై 6, కుటుంబ తగాదాలపై 4, చీటింగ్, ఇంటి తగాదాలు, ఆస్తి తగాదాలపై 2 చొప్పున, వేధింపులపై ఒకటి ఉన్నాయి.

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి

ఫలించిన ఎంపీ, ఎమ్మెల్యేల కృషి

- వీరిరువురూ రాసిన లేఖకు స్పందించిన కేంద్రమంత్రి
- త్వరలో నిర్మాణం, తీరనున్న 15 గ్రామాల ప్రజల సమస్య

చిత్తూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాగునీటి ప్రవాహం, 15 గ్రామాల ప్రజల రాకపోకలకు ఎదుర్కొంటున్న సమస్యను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరిష్కరించారు. చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లె మీదుగా వెళ్తున్న చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే కింద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని 15 గ్రామాల ప్రజలు.. ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన వారు రెండు నెలల క్రితం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలంటే కేంద్రమంత్రి అనుమతి ఉంటేనే జరుగుతుందని తెలుసుకున్నారు. దీనిపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేక రాయగా.. ఆయన స్పందించారు. బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన చర్యలు తీసుకుంటామని తిరిగి లేఖ రాసినట్లు వారు పేర్కొన్నారు. దీంతో 15 గ్రామాలకు చెందిన ప్రజలు ఎంపీకి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.



బ్రిడ్జి నిర్మించాల్సి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే, కలెక్టర్ (ఫైల్ ఫొటో)

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఈ పథకం కింద కుప్పంలో శిక్షణ పూర్తిచేసిన చేతివృత్తులవారికి కలెక్టర్ సర్టిఫికెట్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం కింద శిల్పకళాకారులు, దోబీ, మేస్త్రి వంటి చేతివృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి పెంచేలా శిక్షణ ఇస్తామన్నారు. వీరికి పూచీకత్తు లేకుండా రూ.1.50లక్షల రుణం, రూ.15వేల విలువచేసే పనిముట్లు అందిస్తామన్నారు. శిక్షణ పూర్తిచేసుకుని బ్యాంకులో దరఖాస్తు చేసుకుంటే వారంరోజుల్లోగా రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం హరీష్, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్, డీఏసీ జీఎం శ్రీనివాస యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలు, ప్రభుత్వ కాలేజీల్లో పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను స్పాట్ కోటాలో భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉన్నత విద్యాశాఖ ఇన్‌చార్జ్ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. సెట్‌లో అర్హత సాధించని వారు, పీజీసెట్‌కు హాజరుకానివారికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించవచ్చని ఉన్నత విద్యామండలికి స్పష్టంచేశారు. ఈ కోటాలో అడ్మిషన్లు పొందేవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదన్నారు.

7న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశాన్ని డిసెంబరు 7న నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలోని 45వేల పాఠశాలల్లో మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశం నిర్వహించాలన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.పాఠశాలల్లో బోధన మెరుగుపరచడం, వసతుల అభివృద్ధి లక్ష్యాలతో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఆగలేదు 'బాబూ'!

పట్టుబడుతున్న అక్రమ గ్రానైట్ వాహనాలు



ఆదివారం రాత్రి పట్టుబడ్డ గ్రానైట్ వాహనం



సి.బండపల్లెలో విస్తరించిన గ్రానైట్ క్వారీలు

కుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో అప్పుడప్పుడైనా సరే గ్రానైట్ వాహనాలు పట్టుబడుతూనే ఉన్నాయి. చాలాసార్లు పట్టుబడకుండానే సరిహద్దులు దాటి సాగిపోతున్నాయి. అక్రమ గ్రానైట్ రవాణా మాత్రం నిలవడంలేదు. అక్రమ క్వారీయింగ్ కూడా ఆగడంలేదు. శాంతిపురం మండలంలోని సి.బండపల్లె, సోమాపురం, గుడుపల్లె మండలంలోని ఓఎన్.కొత్తూరు, కనమనపల్లె, యామగానిపల్లె గుత్తార్లపల్లె తదితర పంచాయతీల పరిధిలో వైట్ గ్రానైట్ గుట్టల్లో తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కుప్పం మీదుగానే ఆంధ్రా సరిహద్దులు దాటి తమిళనాడు చేరుతున్నాయి. చాలావరకు గ్రానైట్ క్వారీలు ప్రస్తుత అధికార పక్షంలోని గ్రూపుల చేతుల్లో ఉంటే, కొన్నిమాత్రం ఇంకా వైసీపీ వర్గాల అధీనంలోనే జరుగుతున్నాయి. క్వారీయింగ్ కానీ, గ్రానైట్ అక్రమ రవాణా కానీ, ఈ అన్ని వర్గాల మధ్య సమన్వయంతో సాగుతోంది. అనుపానులు తెలిసినా అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడూ మాత్రం అక్కడో గ్రానైట్ వాహనాన్ని, ఇక్కడో గ్రానైట్ వాహనాన్ని సరిహద్దులు దాటుతుండగా పోలీసులు లేదా గనుల శాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేసి జరిమానా విధిస్తున్నారు. గ్రానైట్ వ్యాపారంలో ఉంటున్న వివిధ వర్గాల మధ్య తేడాలు వచ్చి, ఒకరి అక్రమాల గురించి మరొకరు సమాచారం ఇచ్చినప్పుడే ఇటువంటి దాడులు మొక్కుబడిగా జరుగుతున్నాయన్నది కూడా ప్రజల మధ్య నలుగుతున్న చర్చ. ఇదే తీరులో ఆదివారం రాత్రి సోమాపురం క్వారీనుంచి సరిహద్దులు దాటుతున్న అక్రమ గ్రానైట్ వాహనాన్ని మైనింగ్ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. కుప్పంలోని ఆర్టీసీ డిపో ఆవరణకు తరలించారు. కుప్పం పట్టణం, మండల పరిధిలో లేదుకానీ, సుమారు నెలా నెలన్నర క్రితం అటు గుడుపల్లె, ఇటు శాంతిపురం మండలాల పరిధిలో అక్రమంగా సరిహద్దులు దాటుతున్న గ్రానైట్ వాహనాలను పోలీసులు దాడులు చేసి పట్టుకుని సీజ్ చేసి పోలీసు స్టేషన్లకు తరలించేవారు. అయితే యథేచ్ఛగా అక్రమ రవాణా కళ్లముందే జరుగుతున్నా ఇటీవల ఆ రెండు మండలాల పోలీసులు కూడా ఎందుకో పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇక కుప్పం అర్బన్ పోలీసుల సంగతి సరేసరి. వారు ఎప్పుడైనా పొరపాటున అక్రమంగా తరలుతున్న గ్రానైట్ వాహనాన్ని పట్టుకున్నా, ఆ విషయాన్ని గోప్యంగా ఉంచడం పరిపాటిగా మారింది. ఇలా పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక, గ్రానైట్ వ్యాపారులతో కుదుర్చుకున్న ఏదో మతలబు ఉన్నదన్న అనుమానం ప్రజలది. ఈ అనుమానాన్ని హుళక్కి చేయాలంటే అక్రమ గ్రానైట్ రవాణాపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం తప్ప మరో మార్గాంతరం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా, గ్రానైట్ అక్రమ క్వారీయింగ్, అక్రమ రవాణాలు ఎందుకు ఆగడంలేదో ఆ బేటరాయస్వామికే ఎరుక.

అల్లుడే కాలయముడయ్యాడు

హత్య కేసును ఐదురోజుల్లోనే ఛేదించిన పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు

బంగారుపాళ్యం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పిల్లనిచ్చిన మామ పాలిట సొంత అల్లుడే కాలయముడయ్యాడు.సీఐ కత్తి శ్రీనివాసులు కథనం మేరకు... బంగారుపాళ్యం మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ దండువారిపల్లెకు చెందిన పంచాయతీ వాటర్‌మెన్ కృష్ణమూర్తి , శ్యామల దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు.పెద్దకుమార్తె రమ్యను పదేళ్ళ క్రితం తవణంపల్లె మండలం నరసింహపల్లికి చెందిన మునెప్ప కుమారుడు గిరిబాబుకు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలంగా గిరిబాబు, రమ్య దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. గిరిబాబు తరచూ భార్య రమ్యను చిత్రహింసలకు గురిచేసి పుట్టింటికి పంపించేసేవాడు. తండ్రి కృష్ణమూర్తి తన కుమార్తెకు నచ్చజెప్పి మళ్లీ అల్లుడి ఇంటికి పంపించేవారు. ఈ క్రమంలో మామ, అల్లుడు గొడవ పడ్డారు.ఈ నేపథ్యంలో మామను హతమార్చాలనుకున్న గిరిబాబు తన స్నేహితులైన పూర్ణచంద్ర, అబ్దుల్ రవూఫ్‌లతో కలసి కుట్రపన్నాడు. పథకం ప్రకారం ఈనెల 17వ తేది రాత్రి తవణంపల్లె మండలం నరసింహపల్లికి చెందిన పూర్ణచంద్ర, చిత్తూరులోని గంగనపల్లికి చెందిన అబ్దుల్ రవూఫ్‌లతో కలసి కృష్ణమూర్తిని ద్విచక్రవాహనంపై కొత్తపల్లి సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్ళి మద్యం తాగించారు.మత్తులో వుండగా బండరాయి, బీరు బాటిళ్ళతో తలపై, ఛాతీపై తీవ్రంగా కొట్టి, అక్కడే పడేసి వెళ్ళిపోయారు. ప్రాణాపాయ స్థితిలో వున్న కృష్ణమూర్తిని రహదారిపై వెళ్ళే కొందరు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.వారు చెప్పడంతో అక్కడకు చేరుకున్న కుటుంబసభ్యులు కృష్ణమూర్తిని వేలూరు సీఎంసీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాణిపేట సీఎంసీకి , అక్కడినుంచి తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణమూర్తి మృతిచెందిన విషయం తెలిసిందే.కేసు దర్యాప్తు చేసిన పోలీసులు కేసులో నిందితులైన గిరిబాబు, పూర్ణచంద్ర, అబ్దుల్ రవూఫ్‌లను అరెస్టు చేశారు.విచారణలో నేరం అంగీకరించడంతో సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. హత్యకేసును ఐదు రోజుల్లోనే ఛేదించిన సీఐ బృందాన్ని ఎస్పీ మణికంఠ అభినందించారు.

చుడా చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం

- కాణిపాక ఆలయ సుందరీకరణ పనుల ఫైల్‌పై తొలిసంతకం



కటారి హేమలతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):మాజీ మేయర్, టీడీపీ నగర అధ్యక్షురాలు కటారి హేమలత సోమవారం చుడా చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఉదయం 9.30 గంటలకు టీడీపీ జిల్లా కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్, ఎమ్మెస్సార్ సర్కిల్, గిరింపేట మీదుగా పాత కలెక్టరేట్ కార్యాలయం వరకు కూటమి నేతలతో, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లారు. చుడా కార్యాలయంలో కటారి హేమలత చేత చుడా చైర్‌పర్సన్‌గా జాయింట్ కలెక్టర్, వైస్ చైర్‌పర్సన్ విద్యాధరి ప్రమాణ స్వీకారం చేయించారు. రూ.10 లక్షలతో కాణిపాక దేవాలయ సుందరీకరణ పనుల ఫైలుపై తొలి సంతకం ,మరో రూ.10 లక్షలతో చిత్తూరు కట్టమంచి చెరువు సుందరీకరణ పనుల ఫైలుపై రెండవ సంతకం చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ నేతలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. చుడా పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తామని చెప్పారు. చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తూ, అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో చుడా పరిధిలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్,మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, చెన్నకేశవులు నాయుడు, చంద్రప్రకాష్, గుడిపాల బాలాజి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, నేతలు త్యాగరాజన్, మోహన్‌రాజ్, కేసీ కిరణ్, కటారి లావణ్య, రాజశేఖర్, కంద, పార్థసారధినాయుడు, గోపి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజు ముందే పెన్షన్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెల ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ఒక్క రోజు ముందే నవంబరు 30న ఎన్టీఆర్ భరోసా కింద వృద్ధులకు, వితంతువులకు, ఇతర పెన్షనర్లకు సామాజిక పింఛన్లు అందజేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం డీఆర్‌డీఏ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సూచన చేసింది. 30వ తేదీ పింఛన్ పంపిణీ పూర్తి కాని పక్షంలో డిసెంబరు 2వ తేదీ ఇవ్వనున్నారు. కాగా జిల్లాలో 2.68 లక్షల మంది ఎన్టీఆర్ భరోసా పింఛనర్లు ఉన్నారు.

జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు

- శాప్ చైర్మన్ రవినాయుడు



మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయన్ను మానసిక వైద్యులకు చూపించాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన సోమవారం మాట్లాడుతూ విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలో విద్యాదీవెన కింద రూ.3,200 బకాయిలు పెట్టాడని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించి రూ.2,456 కోట్లు బకాయిలు పెట్టారని పేర్కొన్నారు. విద్యార్థులకు రూ.6వేల కోట్లు అందకుండా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రెండు లక్షల మందికి పైగా విద్యార్థులకు సర్టిఫికెట్లు పొందలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించిందని తెలిపారు. వసతి దీవెన పేరుతో రూ.20వేలు ఇస్తామని కోత పెట్టింది జగన్ కాదా అని ప్రశ్నించారు. విద్యార్థులకు న్యాయం జరిగేందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

టీడీపీ బలోపేతానికి సైనికుడిలా కృషి


ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎంను సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

కుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ఒక సైనికుడిలా కృషి చేస్తానని టీడీపీ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ విప్‌గా నియమితులైన కంచర్ల శ్రీకాంత్‌ను, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వ డమేకాక, గెలిచి వచ్చాక సొంత నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడంతో పాటు ఇప్పుడు ప్రభుత్వ విప్‌గా నియమిం చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడడంతోపాటు పార్టీ పటిష్ఠతకు అహరహం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు పాల్గొన్నారు.

కేడీసీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. టాటా ఎలక్ట్రానిక్స్, అశోక్ లేల్యాండ్, ఎస్ఎస్‌టీ, డెల్ఫి-టీవీఎస్, డీఎఫ్ రానె తదితర కంపెనీల తరఫున ప్రతినిధులు ఇంటర్వ్యూలు జరిపారు. మొత్తం 249 మంది విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలో పాల్గొనగా 177 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల వైస్ చైర్మన్ సాగర్ రాజ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సాగర్‌రాజ్‌తో పాటు ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు, శిక్షణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పార్తిబన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంచర్ల శ్రీకాంత్‌కు సన్మానం



కుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను సోమవారం కుప్పం మున్సిపల్ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ జిమ్ దాము ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తొలుత కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో అమ్మవారికి అందరూ కలిసి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీకి శాలువ కప్పి, పూలమాల వేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్, కౌన్సిలర్లు ఎమ్మార్ సురేశ్, సోము, సెల్వరాజ్, వేలు తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపల్లెలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



పుంగనూరు రూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లెలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'చెర్లోపల్లెలో పారిశుధ్యంలోపం' అనే వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గ్రామాన్ని సందర్శించారు. బోరుమోటర్ వద్ద మురుగునీరు తొలగించి బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. మురుగు కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి క్రిమిసంహారమందులు పిచికారి చేయించినట్లు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ ఆలయంలో ఘనంగా కార్తీక దామోదరపూజ



బైరెడ్డిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం కార్తీక దామో దర పూజ, ధాత్రీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఉసిరిచెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణసేవ జరిగింది. ఈ కార్యక్రమానికి ఒంటిమిట్ట రెడ్డెప్పశెట్టి, మొగిలి చిన్నరెడ్డెప్ప కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. మొగిలి రెడ్డెప్ప, పరిపాటి రవికుమార్ కుటుంబీకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పుంగనూరుకు తరలిన జనసైనికులు

సోమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చదళ్లకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల జనసేనాని పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం పుంగనూరులో ర్యాలీ చేప ట్టారు. జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్ ఆధ్వర్యంలో పలు వాహనాల్లో వెళ్లి ఆ ర్యాలీలో పాల్గొన్నారు.

365 శివలింగాలకు పూజలు



చౌడేపల్లె, నవంబరు25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా లలిత ఆర్యవైశ్య మహిళ మండలి సభ్యులు సోమవారం కార్తీకమాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా బైసాని ఫంక్షన్ హాలులో 365 మట్టి లింగాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వన భోజనాలు నిర్వహించారు.

వైద్యసేవలపై ప్రత్యేకశ్రద్ధ ఉండాలి

బైరెడ్డిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలందించడంలో వైద్యసిబ్బంది ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రాజెక్ట్ అధికారి రామ్మోహన్ సూచించారు. బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. అనంతరం పాతూరునత్తం గ్రామాన్ని సందర్శించి ఆరోగ్య సంరక్షణ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డీఎస్వో ప్రసాద్, డాక్టర్ సాయిశ్రీ, సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్య విద్యాధికారి సావిత్రి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరం



పుంగనూరు రూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరగుంటలో టీడీపీ సభ్యత్వ నమోదును టీడీపీ నాయకులు ముమ్మరం చేశారు. సోమవారం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సభ్యత్వం తీసుకోవడం వల్ల రూ. 5లక్షలు బీమా వర్తిస్తుందని వివరించారు.

భక్తిశ్రద్ధలతో కేదారీశ్వర నోములు


ఆలయం ముందు దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చౌడేపల్లె, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): కేదారీశ్వర నోములను భక్తులు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కార్తీక మాస చివరి సోమవారం స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు కేదారీశ్వరనోముల వ్రత కథను వివరించి నోములు వ్రతాన్ని భక్తులచే ఆచరింప చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు మహిళలు ఆలయం ముందు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులతో కిక్కిరిసిన కాశీవిశ్వేశ్వరుడి ఆలయం



పలమనేరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి) పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరి సిపోయింది. కార్తీకమాసం చివరివారం కావడంతో అధికసంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు.

వీధికుక్కలకు వ్యాక్సినేషన్



పలమనేరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో సోమవారం తిరుపతి నుంచి వచ్చిన అనిమల్ కేర్ సిబ్బంది వీధికుక్కలను పట్టే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. వాటికి సంతాన లేమి వ్యాక్సిన్ వేసి వదిలిపెట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.

కుప్పంలో జోరుగా పారిశుధ్య పనులు


వడ్డెపల్లెలో మలాథిన్ పిచికారీని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలు జోరందుకున్నాయి. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతోపాటు మంచు ఎక్కువగా కురుస్తున్నందున దోమలు విజృంభిస్తున్నాయి. అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటి నివారణ కోసం మలాథిన్ స్ప్రే చేసే కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. తెల్లవారు జామున 5 గంటల నుంచే 10 స్ప్రేయర్లతో మున్సిపాలిటీలోని 25 వార్డుల్లోని మురుగు కాలువలు, నీరు నిలువవున్న ప్రదేశాల్లో మలాథిన్ స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ దాము, ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు అనన్య



సోమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం సూరయ్య గారి పల్లె ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని అనన్య రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం నిరంజన్ కుమార్ తెలిపారు. నెత్తకుప్పంలో జరిగిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో అనన్య ఉత్తమ ప్రతిభ కనబర చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ శివకుమార్ తెలిపారు. ఆమెను ఉపాధ్యాయులు విద్యావతి, సూర్యప్రకాశ్, కుసుమ, చంద్రకళ అభినందించారు.

కౌండిన్య ఖాళీ

- ఇసుక తోడేయడంతో భారీగా ఏర్పడ్డ గుంతలు
- ప్రమాదంలో చెక్‌డ్యామ్‌లు
- బోర్లు అడుగంటే ప్రమాదం


పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో చెక్‌డ్యామ్ ముందు ఇసుక తోడేయడంతో ఏర్పడిన భారీ గుంత

పలమనేరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజక వర్గంలోని కౌండిన్య నదిలో పలు చెక్‌డ్యామ్‌లు నాశిరక నిర్మాణాలతో దెబ్బతిన్నాయి. తాజాగా ఇసుక అక్రమార్కులు చెక్ డ్యామ్‌ల సమీపంలో ఇసుకను ఎక్స్‌కవేటర్లతో తోడేయడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇసుక ఖాళీ అవుతోంది. ఈ నేపథ్యంలో కౌండిన్యనదిలో నీరు ప్రవహిస్తే ఒక్కచెక్ డ్యామ్ కూడా ఉండే పరిస్థితి లేదని పరివాహక రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే వర్షాలు లేక కౌండిన్య నది పూర్తిగా ఎండిపోయిందని ఇటువంటి ఈ పరిస్థితిల్లో ఇసుక కూడా తోడేస్తే భూగర్భ జలాలు అడుగంటిపోయి వ్యవసాయ బోర్లలో సైతం నీరు ఆగిపోయే దుస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నైనా ఇరిగేషన్, రెవెన్యూ, భూగర్భజల సంస్థ అధికారులు, మైన్స్ అధికారులు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవం


స్వామి వారికి వెండి కిరీటాన్ని ఊరేగింపుగా తీసుకు వస్తున్న దాతలు

సోమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లెలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం మూల విరాట్‌కు అభిషేకపూజ, అర్చనలు జరిపారు. అనంతరం స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదారులుగా ముప్పాల నవ్య, హేమాద్రి నాయుడు వ్యవహరించారు. ఉత్సవాల సందర్భంగా టీటీడీ అన్నమాచార్యుల కళాకారులు సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచు కొల్లా హరిప్రసాద్, బాలాజీ నాయుడు, జయచంద్ర, పురుషోత్తం, వెంకట్రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం విరాళం

గల్లా నాగరత్నమ్మ, గల్లా సుధాకర్ నాయుడు రూ.1.25 లక్షలు విలువ చేసే వెండి కిరీటాన్ని స్వామివారికి కానుకగా అందించారు. అంతకుముందు కిరీటాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు.

ఎమ్మెల్యే అమర్‌కు కురబసంఘం నాయకుల సన్మానం


అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న సుబ్రమణ్యం తదితరులు

పలమనేరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో సోమ వారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కురబ సంఘం నాయకులు, రాష్ట్ర కురబ కార్పొ రేషన్ డైరెక్టర్ సుబ్రమణ్యంగౌడు గజమాలతో సన్మానించారు. పలమనేరుకు చెందిన సుబ్రమణ్యంగౌడను కురబ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించడంతో వారు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురబసంఘం నాయకులు సోమశేఖర్ గౌడు, చంద్రప్పగౌడు, సురేష్, మోహన్, జన, యుగంధర్, శంకరప్ప, టీడీపీ నాయకులు ఆర్వీ.బాలాజి, బ్రహ్మయ్య, ఖాజా, నాగరాజు, శ్రీధర్, మదన్, సుబ్బన్న పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం.. కర్ణాటక మద్యం స్వాధీనం

పుంగనూరు రూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): సారా ఊట ధ్వసం చేయడంతో పాటు మరో వ్యక్తి నుంచి కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ సురేంద్రరెడ్డి కథనం మేరకు..మండల పరిధిలోని నల్లగుట్టపల్లె తాండా సమీపంలోని పొలాల్లో సోమవారం ఉదయం పోలీసులు దాడులు చేశారు. అక్కడ నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల సారా ఊటను గుర్తించి ధ్వంసం చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..

పెద్దపంజాణి మండలంలోని పెద్దరికుంట వద్ద చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. చౌడేపల్లె మండలం పీఎల్. కొత్తూరుకు చెందిన మహేశ్ ద్విచక్రవాహనంలో 768 కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో సీఐ జవహర్‌బాబు, సతీష్, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంగౌడు, నాగరాజు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయానికి ఉత్సవమూర్తి వితరణ



సోమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ చిన్న సోమలలో బోయకొండ గంగమ్మ నూతన ఆలయానికి సోమవారం అమ్మవారి ఉత్సవమూర్తిని తిరుచానూరుకు చెందిన కె.ప్రియాంక, లోకేశ్ కుమార్ దంపతులు వితరణ చేశారు. రూ.30 వేలు విలువ చేసే అమ్మవారి ఉత్సవ మూర్తిని అందజేసిన దాతలను ఆలయ నిర్వాహకులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ క్రమంలో అమ్మవారికి అభిషేకపూజలు, అర్చనలు జరిపారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేసిన పలువురు దాతలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి రమణ, హరిముని వెంకటాచారి పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి విశేష పూజలు

బైరెడ్డిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపల్లె గ్రామంలో ఉన్న సోమేశ్వర స్వామి ఆలయంలో సోమ వారం విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేశారు. మహిళలు ఆలయ సన్నిధిలో కార్తీకదీపాలు వెలిగించారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

- కుప్పం ప్రభుత్వాస్పత్రి మాజీ వైస్ చైర్మన్ సుధీర్‌కు స్వల్ప గాయాలు

కుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు, కుప్పం ప్రభుత్వ ఆస్పత్రి మాజీ వైస్ చైర్మన్ గుర్రాల సుధీర్ తోపాటు ఆయన కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. తన భార్యాపిల్లలతో కలిసి సుధీర్ కర్ణాటక రాష్ట్రం త్రిప్పూరులో జరిగిన బంధువుల వివాహానికి హాజరయ్యారు. సోమవారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో ఆయన కారును అతివేగంగా వస్తున్న ఈచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధీర్‌తో పాటు కుటుంబ సభ్యులు స్వల్పంగా గాయపడ్డారు. కారు పాక్షికంగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంపై వారు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

శివాలయాల్లో కేదారవ్రత నోములు

రొంపిచెర్ల, నవంబరు25,(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె సిద్ధ లింగేశ్వరస్వామి, మోటమల్లెల కాశీ విశ్వేశ్వర స్వామి, పెద్దగొట్టిగల్లులోని జ్ఞానాంబికా ఓంకారేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక మాసం నాల్గవ సోమవారం పురస్కరించుకొని మహిళలు పెద్దఎత్తున కేదారవ్రత నోములు నోచుకున్నారు. దీపారాధనలు, అభిషేకాలు చేయించారు.

కల్లూరు -రొంపిచెర్ల బస్సులను పునరుద్ధరించాలి

రొంపిచెర్ల, నవంబరు25(ఆంధ్రజ్యోతి): కల్లూరు - రొంపిచెర్ల మధ్య సెటిల్ సర్వీసులు పునరుద్ధరించాలని రొంపిచెర్ల మండల ప్రజలు కోరుతున్నారు. గతంలో ఈమార్గంలో నాలుగు బస్సులు తిరిగేవి. క్రమేణా అవి నిలిచిపోయాయి. దీంతో చిత్తూరు జిల్లా కేంద్రానికి వెళ్లి రావడానికి మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పుంగనూరు -చల్లంపల్లె ఒక్క బస్సు మాత్రమే నడుస్తోంది. ఈ బస్సు గానుగచింత, చల్లంపల్లె, కమ్మపల్లె, మోటమల్లెల గ్రామాల నుంచి రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలకు వచ్చే విద్యార్థులు కోసం నడుస్తోంది. విద్యార్థులకే బస్సు సరిపోతోంది. ఇతర ప్రయాణికులకు బస్సు చాలడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కల్లూరు -రొంపిచెర్ల మధ్య బస్సు సర్వీసులు నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శైవ క్షేత్రాల్లో భక్తుల సందడి



సోమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం శైవ క్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్‌కు విశేష అలంకరణ జరిపి అభిషేకపూజలు జరిపారు. స్థానిక భజన మండలి సభ్యులు అఖిలాండం ఏర్పాటు చేసి రాత్రి జాగరణ చేశారు. శివనామ స్మరణలతో స్వామివారికి పూజలు జరిపారు. ● దుర్గంకొండ మునీశ్వరస్వామి ఆలయం, పెద్దఉప్పరపల్లె సమీప మోక్షేశ్వ రస్వామి ఆలయం, ఇరికిపెంట మధురమలై కొండలో మల్లేశ్వరస్వామి ఆలయం, మల్లేశ్వరపురం మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మద్యం తాగవద్దన్నందుకు ఆటో డ్రైవర్ ఆత్మహత్య

పలమనేరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని అన్నందుకు ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు గంటావూరు కాలనీకి చెందిన మస్తాన్ అనే ఆటోడ్రైవర్. ఇతడు తాగుడుకు బానిసయ్యాడు. ఇటీవల ఆరోగ్యం సరిగా లేక ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా మళ్లీ మద్యం తాగేవాడు. దీంతో మద్యం మానేయాలని ఇంట్లో వారు మందలించారు. మనస్తాపానికి గురైన మస్తాన్ ఆదివారం రాత్రి కాలనీ సమీపంలోని మామిడిచెట్టుకు ఉరే సుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

7న తల్లిదండ్రుల సమావేశం

రొంపిచెర్ల, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థుల తల్లిదండ్రులతో వచ్చేనెల 7వ తేదీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, సీఆర్‌పీలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది, పాఠశాల విద్యాకమిటీల ఏర్పాటు, మధ్యాహ్న భోజన నిర్వహణ, బడిబయట పిల్లలను పాఠశాలకు రప్పించడం, నాణ్యమైన బోధనపై చర్చించారు. తల్లిదండ్రుల సమావేశంలో ఈ అంశాలపై చర్చించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కబడ్డీ విజేత చౌడేపల్లె

- రన్నర్స్‌గా పుదిపట్ల


గెలుపొందిన బాలుర సీనియర్ జట్టు, బాలికల జూనియర్ జట్టు

చౌడేపల్లె, నవంబరు25:(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం జోనల్ కబడ్డీ పోటీలు హోరా హోరీగా జరిగాయి. సోమవారం స్థానిక హైస్కూల్లో సీనియర్ బాలురు, జూనియర్ బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గం నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో చౌడేపల్లె హైస్కూల్ విద్యార్థులు సీనియర్ బాలుర విభాగంతో పాటు జూనియర్ బాలికల విభాగంలోనూ విజయం సాధించారు. అలాగే పుదిపట్ల హైస్కూల్ విద్యార్థులు సీనియర్ బాలురు, జూనియర్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన క్రీడాకారులకు దాతలు పార్థసారధి, బసవరాజులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజరెడ్డి, పీఈటీ రాజేంద్ర, పీడీ వెంకటేష్, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి: జనసేన


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): యువతను రాజకీయాల్లోకి తీసుకురావడమే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ధ్యేయమని జనసేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జనసేన శంఖారావం కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలాజీ థియేటర్ నుంచి ఎంబీటీరోడ్డు, ఇందిరాసర్కిల్, ప్రైవేటుబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో స్థానిక సంస్థల ఎన్నికలల్లో ఎవరినీ పోటీ చేయనీయకుండా అడ్డుకున్న ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. తాను చదళ్లలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రయత్నం చేయగా తనపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారన్నారు. గత ఏడాది కార్తీక మాసంలో మండలంలోని అగస్త్రీశ్వరస్వామి ఆలయంలో పూజలు చేయనీయకుండా అడ్డుకున్నారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన జరగడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరలోనే పుంగనూరుకు పవన్ కళ్యాణ్ రానున్నట్లు తెలిపారు. పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో నాయకులు పడగాల రమణ, విరూపాక్షి, శివకుమార్, నరేంద్రరెడ్డి, చైతన్యరాయల్, హరినాయక్, బాలాజీనాయక్, శ్రీనివాసులు, బాబు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలానికి చెందిన బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గురజాల జగన్ పంపిణీ సోమవారం చేశారు. ముట్టుకూరుకు చెందిన మేషాక్‌కు కిడ్నీ సంబంధిత చికిత్స కోసం రూ.59,995, గువ్వకల్లుకు చెందిన కందస్వామి కుమారుడి చికిత్స కోసం రూ.26,218 చెక్కులను వారికి అందజేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, మోహన్‌రాజ్, శశికర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం ఇంద్ర వరదుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, టీడీపీ నాయకులు

యాదమరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యాదమరి వరదరాజులస్వామి కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. మండలకేంద్రంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి నూతనంగా నిర్మించిన బాలాజీ కళ్యాణమండపం ప్రారంభోత్సవంలో భాగంగా కల్యాణ మండపం వేదికపై యాదమరి త్రివేణి సంగమంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ఇంద్ర వరదరాజస్వామివార్లకు కల్యాణోత్సవం జరిపించారు. చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ రాజ్యసభ సభ్యురాలు ఎన్‌పీ దుర్గ, టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, నాయకులు జయచంద్ర నాయుడు, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 29 మందికి ఉద్యోగాలు



వెదురుకుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 29 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, డీఆర్డీఏ, కళాశాల జేకేసీ సంయుక్తంగా ఈ జాబ్‌మేళా నిర్వహించారు. ఫ్లిప్‌కార్టు, యాక్సిస్ బ్యాంకు, హోంకేర్ సర్వీస్, టాటా కేపిటల్ లిమిటెడ్‌కు సంబంధించిన హెచ్‌ఆర్ ప్రతినిధులు 63 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, 29 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు.

పంటపొలాలపై అడవిపందుల దాడులు



మరకాలకుప్పంలో ధ్వంసమైన వరి

గుడిపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై అడవిపందులు దాడి చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గుడిపాల మండలంలోని చిత్తపార, బండపల్లె, కల్లూరు, నారగల్లు, మరకాలకుప్పం తదితర గ్రామాల్లో వరిపంట చేతికందే దశలో అడవి పందులు తొక్కి నాశనం చేస్తున్నాయని రైతులు తెలిపారు. సాగుకోసం చేసిన అప్పులు తీర్చలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చుడా ఛైర్‌పర్సన్‌కు సన్మానం



హేమలతను సన్మానిస్తున్న తెలుగుయువత నేతలు

పూతలపట్టు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చుడా ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన కటారి హేమలతను పూతలపట్టు మండల తెలుగుయువత నేతలు సోమవారం సన్మానించారు. నేతలు అర్జున్, జయప్రకాష్, యువరాజులు, మునిరాజు, హరిబాబు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

వెదురుకుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని వరసిద్ధి వినాయక స్వామి, లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం 5వ వార్షికోత్సవం పూజలు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. దేవరఎద్దు ఊరేగింపుతోపాటు ఆలయ ఆవరణంలో భజన కార్యక్రమాలను జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

సిమెంటు దిమ్మెను ఢీకొన్న ఆటో

- డ్రైవర్ మృతి



మురళి మృతదేహం

చిత్తూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న సిమెంటు దిమ్మెను ఆటోతో ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ దశరథరామ రాజు తెలిపిన వివరాల మేరకు.. అశోక్‌పురానికి చెందిన ఆటోడ్రైవర్ మురళి(44) సోమవారం తన ఆటోలోని ప్రయాణికులను నగరంలో దింపేశాడు. తిరిగి ఖాళీగా వేలూరు రోడ్డులో అశోక్‌పురం వైపు బయల్దేరాడు. ఈ సమయంలో గంగినేని పార్కును ఆనుకుని ఉన్న దిమ్మెను వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మురళి మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం అయ్యాక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

చిత్తూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని.. ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ సీఐ శ్రీహరి రెడ్డి తెలిపారు. సోమవారం గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం రోడ్డులోని ముసలయ్యగారిపల్లె క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనంలో వస్తున్న చిన్నవేపంజేరికి చెందిన అశోకన్ తనిఖీ చేయగా.. అతడి వద్ద కర్ణాటకకు చెందిన మద్యం టెట్రా ప్యాకెట్లు 48 ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఇతడికి మద్యం సరఫరాచేసిన ప్రభు అనే వ్యక్తిపైనా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అశోకన్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐ పృథ్వీరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు



ముందుభాగం నుజ్జయిన కారు

గుడిపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నుంచి వేలూరు వెళుతున్న కారు 190 రామాపురం సీఎంసీ వద్ద సోమవారం లారీని ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జయినా అందులోనివారికి ఎటువంటి గాయాలవలేదు. ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

గాయపడిన విద్యార్థి మృతి



గౌతమ్ మృతదేహం

గుడిపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పానాటూరు వద్ద చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో ఈనెల 23వ తేదీన గౌతమ్ అనే విద్యార్థి మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో తలకు తీవ్రంగా గాయమైంది. చికిత్స నిమిత్తం 190 రామాపురం సీఎంసీలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో రాణిపేటకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ రామ్మోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూతలపట్టు టీడీపీ నేత మృతి



కాంతారావు (ఫైల్ ఫొటో)

పూతలపట్టు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం టీడీపీ సీనియర్ నేత కాంతారావు అనారోగ్యంతో మృతిచెందాడు. పేటఅగ్రహారం గ్రామానికి చెందిన దావులూరి కాంతారావు పూతలపట్టు సింగిల్ విండో అధ్యక్షుడిగా డీసీసీబీ, డైరెక్టరుగా గతంలో పనిచేశారు. ఈయన మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నేత యువరాజులు నాయుడు, అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు గణపతి నాయుడు, సి.కె. చిట్టి, చంద్రబాబు, హిమగిరి నాయుడు, ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళి, శేషాద్రి నాయుడుతో పాటు పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

పాలసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బలిజకండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రంగయ్య కుమారుడు కార్తిక్(31) సోమవారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో అంత్యక్రియల నిమిత్తం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేసి పార్టీ ద్వారా రావలసిన మొత్తాన్ని త్వరలో ఇప్పిస్తానన్నారు. ఆయనవెంట నాయకులు వాసునాయుడు, శేఖర్ రాజు, తంగరాజ్, రంజిత్,నవీన్ తదితరులు ఉన్నారు.

కార్తీక శోభ



మణికంఠేశ్వరస్వామి ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఐరాల(కాణిపాకం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వరస్వామి గుడిలో కార్తీక సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మహిళా భక్తులు ఆలయానికి ఉపవాస దీక్షతో విచ్చేసి మణికంఠేశ్వర స్వామి అభిషేకంలో పాల్గొన్నారు. ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద మహిళా భక్తులు పిండి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రసాదం స్వీకరించి ఉపవాస దీక్షను విరమించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు పర్యవేక్షించారు.



మొక్కు తీర్చుకుంటున్న భక్తులు

విజయపురం: మండలంలోని జగన్నాథపురం శ్రీరామనామక్షేత్రంలో పన్నూరు ఆనంద వల్లీ ఇష్టకామేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కు తీర్చుకున్నారు. ఆలయ పురోహితులు రాంప్రసాద్‌శర్మ, బాలసుబ్రహ్మణ్యం శర్మ, భక్తులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని రాచపాళ్యంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద మహిళలు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మూల విరాట్‌కు తమిళనాడు తిరువణ్ణామళై ఆలయం నుంచి విచ్చేసిన అర్చకులు మణిగండగురుకుల్, శివానందగురుకుల్‌లు రుద్రాభిషేకం నిర్వహించి అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మండలవాసులతో పాటు బెంగళూరు నుంచి భారీ ఎత్తున పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో బాలగురునాథీశ్వర స్వామి

చిత్తూరు కల్చరల్: చిత్తూరు నగరంలోని కట్టమంచి వరదరాజ స్వామి ఆలయ వీధిలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనకు నగరవాసులు తరలి వచ్చారు.



బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగాల ప్రదర్శన, చిదంబరేశ్వర ఆలయంలో ఏఎస్పీ రాజశేఖర్ రాజు

గిరింపేట చిదంబరేశ్వర ఆలయంలో ఏఎస్పీ రాజశేఖర్ రాజు తన కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయం, కట్టమంచి కులందేశ్వర, ఇరువారం నాగేంద్ర, కాశీ విశ్వేశ్వర (రాజుగుడి) ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

వెదురుకుప్పం: చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు జరిగాయి. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.



మొక్కుబడి సమావేశాలు వద్దు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'మొక్కుబడి సమావేశాలు వద్దు.. మీ శాఖకు సంబంధించి పూర్తి సమాచారంతోరండి' అని అధికారులను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు పరిష్కారం అయ్యాయా లేదా అనే పూర్తి సమాచారంతో సభకు హాజరు కావాలన్నారు. మండల అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మండలంలో ఐటీఐ, పాలిటెక్నిక్, ఐటీ టవర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం సంక్షేమం, అభివృద్ధిపై వివిధ శాఖలవారీగా సమీక్షించారు. ఎంపీడీవో రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్, జడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీ భారతి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



ఆలయంలో కటారి హేమలత, కనుమూరి బాపిరాజుకు జ్ఞాపికను అందిస్తున్న అధికారులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) ఛైర్‌పర్సన్ కటారి హేమలత, టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు కుటుంబ సమేతంగా సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వీరు స్వామిని వేర్వేరుగా దర్శించుకోగా, సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఎస్‌ఐ ధరణిధర పాల్గొన్నారు.

పసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కార్వేటినగరం వ్యవసాయాధికారి ఆర్.హేమలత సోమవారం తెలిపారు. వరి, వేరుశనగ పంటలకు దిగుబడి ఆధారిత పంటల బీమా.. టమోటా, మామిడి పంటలకు వాతావరణ ఆధారిత పంటల బీమా ఉందన్నారు. పంట రుణాలు తీసుకోని రైతులు వరి ఎకరాకు రూ.630, వేరుశనగ ఎకరాకు రూ.480, టమోటా ఎకరాకు రూ.1,600 ప్రీమియం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీమా చేసుకున్న రైతులకు పంట నష్టం జరిగితే వేరుశనగకు ఎకరాకు రూ.30వేలు, వరికి రూ.42వేల పరిహారం వస్తోందన్నారు. ఇతర వివరాలకు రైతు సేవా కేంద్రాలు లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నగరి: పీఎం పసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ వ్యవసాయాధికారి సౌభాగ్యమ్మ, వ్యవసాయాధికారి రాఘవేంద్రయాదవ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

చిత్తూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంత చేయాలని టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో రూరల్ మండల టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, రాజా, సుథేష్, రవి, మనోహర్‌నాయుడు, సత్య, శీనా, లాజర్, రాజేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

డీలర్లపై ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు

గుడిపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డీలర్లపై ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశంలో ఆయనప్రసంగించారు. డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, రీసర్వే డీటీ రూపాదేవి, ఆర్‌ఐ రామసాయి, వీఆర్వోలు పాల్గొన్నారు.

బీఎల్వోలకు నోటుబుక్, పెన్నుల వితరణ

పెనుమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్వో)లకు నోటుబుక్కు, పెన్ను, పెన్సిళ్లను నియోజకవర్గ ఎన్నికల డీటీ మోహన్‌రాజ వితరణ చేశారు. మండలంలో 42 బూత్‌లకు నియమితులైన బీఎల్వోలకు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

గోకులం షెడ్లు సకాలంలో పూర్తి చేయండి

శ్రీరంగరాజపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్ద తయ్యూరులోని మినీ గోకులం షెడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీడీవో మోహన్ మురళి పరిశీలించారు. షెడ్లను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పశువైద్యాధికారి శ్రీవిద్య, బాలాజి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల డీలర్ల సంఘం కార్యవర్గం

గుడిపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీలర్ల సంఘం కార్యవర్గాన్ని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీఆర్ ఆనంద్ (వెప్పాలమానుచేను), ఉపాధ్యక్షుడిగా మార్కొండ యాదవ్ (మరకాలకుప్పం), సెక్రటరీగా కిలారిపల్లెకు చెందిన వెంకటేష్, ట్రెజరర్‌గా గోపీనాథ్‌లను ఎన్నుకున్నారు.

యువత రక్తదానం చేయాలి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేయాలని పీసీఆర్ వృత్తి విద్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్‌కుమార్ సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి దూర్వాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం కళాశాలలోని మెడికల్ ల్యాబ్ టెస్టు (ఎంఎల్‌టీ) గ్రూపు అధ్యాపకులు రక్తపరీక్షలు చేశారు. ఫిజియోథెరపి డాక్టర్ నరేష్‌కుమార్, అధ్యాపకులు కిరణ్, అమీరుద్దీన్, వెంకటరమణారెడ్డి, మహిమదాస్ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

చిత్తూరు కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత వి.రఘుపతికి నవ్యాంధ్ర రచయితుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు జరిగిన కార్యక్రమంలో కరణం జ్ఞానేశ్వరి స్మారకఅవార్డును ప్రదానం చేశారు. రూ.3000, సన్మాన పత్రం, జ్ఞాపిక అందజేశారు.

బాధితులకు సత్వర న్యాయం: కమిషనర్

చిత్తూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వరం న్యాయం చేయాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో పించను కోసం ఇద్దరు అర్జీలు సమర్పించారు. విచారించి, తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఎంహెచ్‌వో లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

2,900 లీటర్ల సారా ఊట ధ్వంసం



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

నగరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని మాంగాడులో సారా తయారీ మితిమీరిపోవడంతో ఎక్సైజ్ పోలీసులు వరుస దాడులు చేపట్టారు. రెండ్రోజులుగా జరుగుతున్న దాడులలో వేలాది లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. మాంగాడు అటవీ ప్రాంతంలో వరదనీరు ప్రవహిస్తున్న కాలువ నీటితో సారాతయారీ జోరుగా సాగుతుండటంతో చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో నగరి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డి, నాగలాపురం ఎక్సైజ్ ఎస్‌ఐ బాబు తమ సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు చేశారు. మాంగాడులో అటవీప్రాంతంలో 2,900 లీటర్ల సారా ఊటను, బట్టీలను ధ్వంసం చేశారు. సారా తయారీదారులు పరారీ కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ● మాంగాడుకు చెందిన సోమయ్య రెండ్రోజుల కిందట ఆటోలో సారా రవాణా చేస్తుండగా నగరి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు సోమవారం తెలిపారు.

1,400 లీటర్ల సారా ఊట ధ్వంసం



సారా సామగ్రితో సీఐలు, సిబ్బంది

వెదురుకుప్పం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నక్కలాంపల్లి, యనమలమంద శివారు ప్రాంతాల్లో సోమవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1,400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. ఈఎస్‌టీఎఫ్ సీఐ మోహన్, ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ పవన్‌కుమార్, కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

కార్వేటినగరం మండలం రాజులకండ్రిగకు చెందిన సారా విక్రేత ఎస్.గంగాధర్‌ను సోమవారం అరెస్టుచేశారు. అతడివద్ద నుంచి మూడు లీటర్ల సారా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసినట్లు కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి తెలిపారు.

కలెక్టరేట్‌లో విశ్రాంతి భవనం ఏర్పాటు చేయండి



కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ వాహన డ్రైవర్ల రాష్ట్ర సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రభుత్వ డ్రైవర్లకు విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలని లేదా ఒక గదిని కేటాయించాలని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి తదితరులు సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరపాలక సంస్థలో పదోన్నతి పొందడానికి అర్హత కలిగి ఉన్న నలుగురు హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్లకు న్యాయం చేయాలన్నారు.

జీడీనెల్లూరు పంచాయతీ కార్యదర్శుల సంఘ కార్యవర్గం



పి. కిరణ్‌కుమార్, ఎం.కె. దుర్గాప్రసాద్

గంగాధరనెల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా పి.కిరణ్‌కుమార్ (ముక్కళత్తూరు), ప్రధానకార్యదర్శిగా ఎం.కె. దుర్గాప్రసాద్ (వేల్కూరు)తోపాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ ఎన్నికకు పరిశీలకుడిగా ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి వ్యవహరించారు. ఉపాధ్యక్షులుగా ఎం.చిన్నబ్బరెడ్డి (నెల్లేపల్లె), జె.కుమార్ (పాచిగుంట), ట్రెజరర్‌గా వి.శివయ్య (బాలగంగనపల్లె), ఈ.సి.మెంబర్లుగా వై.కుమార్, పి.అమల, పి.ఎం.చంద్ర, ఎం.ఝాన్సీ, ఎ.నిర్మల, జి.శ్రీనాథ్, జి.యుగంధర్ ఎన్నికయ్యారు.